న్యూస్‌రీల్

పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న కమిషనర్

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు తారకరామకాలనీలో రూ.2లక్షలతో చేపట్టే డ్రైనేజీ నిర్మాణపు పనులను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, కౌన్సిలర్ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నస్పూర్: పట్టణ పరిధిలోని ఆర్‌కే 6 సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 7.30 నుంచి 11.00గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ నస్పూర్ ఏఈ రామ్మూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ హైవే విస్తరణ పనుల్లో భాగంగా ఎలక్ట్రికల్ లైన్స్, ట్రాన్స్‌ఫార్మర్స్ షిఫ్టింగ్ కారణంగా విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

'ఇళ్ల మధ్య చికెన్‌సెంటర్‌పై అభ్యంతరం'

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని మేదరివాడ కాలనీ, బైపాస్ రోడ్డు టర్నింగ్ వద్ద పెద్ద మొత్తంలో ఏర్పాటు చేస్తున్న చికెన్ సెంటర్, కోళ్ల గోదాం సెంటర్‌ను ఇళ్ల మధ్య ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ, ఆ కాలనీ వాసులు సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తక్షణమే చికెన్ సెంటర్ ఏర్పాటును అధికారులు అడ్డుకోవాలని, లైసెన్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

విజ్ఞానయాత్రలో విద్యార్థులు



మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని ముల్కల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులు విజ్ఞానయాత్రకు తరలివెళ్లారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బొమ్మ గణపతిరెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సాలార్‌జంగ్ మ్యూజియం, గోల్కొండ, బిర్లా పాంటోరియమ్, చార్మినార్, బిర్లామందిర్‌లను సందర్శించారు. విద్యార్థులతో రామకృష్ణ, వీరశంకర్, రాజశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, జగన్ ఉన్నారు.

చట్టాలపై అవగాహన



సదస్సులో పాల్గొన్న తహసీల్దార్ వాసంతి

భీమారం/కోటపల్లి: రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని భీమారంలో తహసీల్దార్ వాసంతి, కోటపల్లిలో ఎంపీపీ సురేఖా ప్రజలను కోరారు. 'పౌరహక్కుల దినోత్సవం' సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో మాట్లాడారు. హక్కుల గురించి తెలుసుకుంటే అనేక సమస్యల నుంచి దూరంగా ఉండవచ్చని సూచించారు. అనంతరం హక్కుల గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాట	రూ.10
పచ్చిమిర్చి	50
చిక్కుడు కాయ	50
బీరకాయ	100
వంకాయ	60
కాకరకాయ	60
బెండకాయ	40
అలసంద	40
దొండకాయ	70
ములక్కాయ	100
సోరకాయ	30
పూగోబి	30
ఆకుగోబి	30
తోటకూర	30
పాలకూర	40
క్యారెట్	60
గోరుచిక్కుడు	90

- మంచిర్యాలఅగ్రికల్చర్



నీల్వాయి.. నిండా ముంచుతోంది!



ప్రాజెక్ట్ కట్ట కింద ఉన్న మామడ గ్రామం

- ప్రాజెక్టు నిర్మాణంతో మామడ వాసుల కష్టాలు
- ఏడాది పొడవునా ఊరంతా తేమ
- హామీగానే పునరావాసం!

వేమనపల్లి: మండలంలోని మామడ గ్రామాన్ని నీల్వాయి ప్రాజెక్ట్ నిండాముంచుతోంది. 'మేము ఈ ఊళ్లో బతకలేం.. మమ్మల్ని వేరే చోటికి పంపించి పునరావాసం కల్పించండి' అంటూ మామడ గ్రామస్తులు అధికారులను.. ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నారు. ఇళ్లు, స్థలాలు ఇస్తామని హామీలు ఇచ్చి ఆరేళ్లు గడిచినా పట్టించుకునే వారు కరువయ్యారని వాపోతున్నారు. నీల్వాయి ప్రాజెక్టు మూలంగా చుట్టూ నీళ్లతో ఇబ్బంది పడుతున్నామంటూ కన్నీరు కారుస్తున్నారు. సుమారు 120యాదవ కుటుంబాలు ఉంటుండగా, కిలోమీటర్ దూరం వరకు ఈ గ్రామం చుట్టూ ఎప్పుడూ నీళ్లే ఉంటాయి. నీటి గుంటలు ఈగలు, దోమలకు ఆవాసాలుగా మారి గ్రామస్తులకు వ్యాధులను తెచ్చిపెడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాకాలంలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు గ్రామంలో సుమారు 8ఇళ్లు, పాకలు కూలిపోయాయి. మరిన్ని ఇళ్లకు ప్రమాదం ఉండగా కలెక్టర్ ఆదేశాలతో మామడ గ్రామాన్ని ఖాళీ చేయించి, నీల్వాయిలో ఉన్న కేజీబీవీ హాస్టల్‌కు తరలించి షెల్టర్ ఏర్పాటు చేశారు. వారం రోజులు అక్కడే తలదాచుకున్న గ్రామస్తులు, వర్షాలు తగ్గుముఖం పట్టాక తిరిగి గ్రామానికి చేరుకున్నారు. బెల్లంపల్లి ఆర్డీవో శ్యామలాదేవి, తహసీల్దార్ రాజ్‌కుమార్ గ్రామస్తులకు ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇస్తానని గ్రామస్తులకు భరోసానిచ్చారు. కానీ కార్యరూపం దాల్చిన దాఖలాలు లేవు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకొని గ్రామాన్ని వేరే చోటికి తరలించాలని, ఇళ్ల స్థలాలు ఇప్పించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కూలిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు

ఇళ్ల స్థలాలు ఇప్పించండి..!



ఆర్డీవోకు విన్నవిస్తున్న మామడ గ్రామస్తులు

వేమనపల్లి: నీల్వాయి ప్రాజెక్టు మట్టి కట్ట కింద ఇబ్బందులతో సతమతమవుతున్న మాకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని మామడ గ్రామస్తులు బెల్లంపల్లి ఆర్డీవో శ్యామలాదేవికి సోమవారం వినతిపత్రం అందజేశారు. తమకు ఇంటి స్థలాలు ఇప్పిస్తూ, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కూడా ఇవ్వాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గ్రామస్తులు గోర్క లింగరాజు, రాజన్న, మంగయ్య, వెంకన్న, ఐలయ్య, మహేష్, శంకర్, రాధక్క, రాజక్క, మల్లక్క ఉన్నారు.

ఇళ్లు కూలుతున్నయ్..



ప్రాజెక్ట్ కింద ఊరు ఉండటంతో నీళ్ల తేమతో గోడలు పగుళ్ల తేలి ఇళ్లు కూలిపోతున్నయ్. నీటి నిల్వలతో దోమలు, ఈగలు పెరిగి, వ్యాధులబారిన పడుతున్నాం. లక్షల రూపాయలు ఆసుపత్రులకే పెట్టాల్సి వస్తోంది.. మమ్మల్ని ఊరి నుంచి వేరే చోటుకి మార్చి ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

– జిల్ల పోశం, స్థానికుడు

పరిష్కారం చూపాలే..



మామడ గ్రామాన్ని వేరే చోటికి మార్చాలి. అధికారులు, లీడర్లు హామీలు ఇచ్చిన ప్రకారం మా అందరికీ స్థలం ఇచ్చి, ఇళ్లు కట్టియ్యాలే. వానకాలం వస్తే అప్పటి వరకు షెల్టర్ ఇవ్వడం కాదు, ఇళ్లు కట్టిచ్చి పూర్తి స్థాయి పరిష్కారం చూపాలే.

– ఎలుకుచ్చి రాజక్క

ఘనంగా గాంధీ వర్ధంతి



బెల్లంపల్లి: మాట్లాడుతున్న నాయకులు



మందమర్రిరూరల్: పూలమాల వేస్తున్న రమేశ్

కాసిపేట/బెల్లంపల్లి/వేమనపల్లి/తాండూర్/నెన్నెల/రామకృష్ణాపూర్/మందమర్రిరూరల్: జాతిపిత మహాత్మగాంధీ వర్ధంతిని సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఊరూరా గాంధీ విగ్రహాలకు, చిత్రపటాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. జాతిపిత అనుసరించిన మార్గం అనుసరణీయమని, దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో గాంధీ శాంతియుతంగా నిర్వహించిన పోరాటం చరిత్రలో మరువలేనిదని పలువురు పేర్కొన్నారు. గాంధీ చూపిన మార్గంలో అందరూ నడువాలని ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



రామకృష్ణాపూర్: నివాళులర్పిస్తున్న నాయకులు



తాండూర్: నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

- ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: ప్రజల మధ్య ఉంటూ వారికి అత్యవసర సమయాల్లో వైద్య సేవలు అందిస్తున్న ఆర్‌ఎంపీలు ప్రజలకు సేవా భావంతోనే మరింత మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని లారీ అసోసియేషన్ భవనంలో సోమవారం తెలంగాణ ఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ మంచిర్యాల జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్లెల్లో పనిచేసే ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నేతి రాజేశ్వర్, రాష్ట్ర అధికార ప్రతినిధి రవీంద్రాచారి, జిల్లా నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

వన్యప్రాణులతో సహజ పర్యావరణ అభివృద్ధి

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రంలోని సాయికుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం పశువైద్యశాఖ ఆధ్వర్యంలో 'వన్యప్రాణులతో సహజ పర్యావరణ అభివృద్ధి'పై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే దివాకర్‌రావు హాజరై మాట్లాడారు. అనంతరం విజేతలకు ఎమ్మెల్యే, జిల్లా పశువైద్యాధికారి రమేశ్ బహుమతులు అందజేశారు.

'ప్రజావాణి' సద్వినియోగం చేసుకోండి



భీమారంలో ప్రజావాణిలో పాల్గొన్న ఎంపీడీవో



దండేపల్లి: గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తున్న స్థానికుడు



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

చెన్నూర్‌రూరల్/దండేపల్లి/భీమారం/కోటపల్లి/భీమిని/వేమనపల్లి: జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరైనా కొన్ని చోట్ల ఫిర్యాదులు చేసే వారే కరువయ్యారు. దండేపల్లి మిషన్ భగీరథ నీరు మురికిగా వస్తుందని ఫిర్యాదు చేయగా, భీమినిలో పింఛన్‌కు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయి. చెన్నూర్‌లో ఒక ఫిర్యాదు రాగా, భీమారం, వేమనపల్లి, కోటపల్లిలో ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. సమస్యల పరిష్కారానికి నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలని వినతి

లక్సెట్టిపేట: ఇళ్ల స్థలాలు లేని పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలని సీపీఐ న్యూ డెమొక్రసీ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన కలెక్టర్ భారతీ హోళ్లికేరికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీఎన్‌జీవోస్ కాలనీలో ఉన్న భూమిని స్వాధీనం చేసుకుని, ఇళ్లు లేని పేదలకు అందించాలన్నారు. ఆ భూమి ఆక్రమణకు గురవుతుందని, కొంతమంది అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారని వాపోయారు. ఆ నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందించారు.

'అక్రమ పట్టాదారుల పేర్లు తొలగించాలి'

జైపూర్: మండలంలోని ఇందారం గ్రామంలోని దళితుల భూమిని అక్రమంగా పట్టా చేయించుకున్న వారి పేర్లు రికార్డుల నుంచి తొలగించాలని బాధితులు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ టేకుమట్ల గ్రామానికి చెందిన కొందరు అక్రమంగా పట్టా చేయించుకున్నారని ఆరోపించారు. వెంటనే అక్రమ పట్టాదారుల పేర్లు తొలగించి దళితులకు చెందేలా చూడాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో ఆసంపల్లి మల్లేష్, చిప్పకుర్తి సతీష్, రాజారావు, రాజం, లక్ష్మణ్ ఉన్నారు.

సాదాసీదాగా మున్సిపల్ సమావేశం

లక్సెట్టిపేట: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం సాధారణ సమావేశం నిర్వహించగా సాదాసీదాగా సాగింది. మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య హాజరై మాట్లాడారు. ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. శివరాత్రి సందర్భంగా ఇటిక్యాల, మోదెల ఘాట్‌ల వద్ద సౌకర్యాల గురించి చర్చించి, భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పట్టణప్రగతి నిధులతో ప్రతీ వార్డులో హైమాస్ట్‌లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. పట్టణంలో అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలు తొలగించాలని, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పక్కన ఆరు గుంటల భూమిని మున్సిపల్ స్వాధీనం చేసుకుని కంచె ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అనంతరం ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి పనుల ఖర్చులు, భవిష్యత్‌లో చేపట్టే పనులపై చర్చించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్‌గౌడ్, కమిషనర్ వెంకటేష్, మేనేజర్ శ్రీహరి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న చైర్మన్

'గడపగడపకూ పీఎస్‌ఆర్'

శ్రీరాంపూర్: నస్పూర్ మున్సిపల్ పరిధిలోని 6వ వార్డులో సోమవారం 'గడపగడపకూ పీఎస్‌ఆర్' కార్యక్రమం చేపట్టగా డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ హాజరయ్యారు. ఇంటింటికీ వెళ్లి పీఎస్‌ఆర్ కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను వివరించారు. వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు. క్యాలెండర్‌ను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుర్మిళ్ల వేణు, కౌన్సిలర్ బొద్దున సంధ్యారాణి, నాయకులు పాల్గొన్నారు. అనంతరం నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ ఇటీవల నస్పూర్‌లో ఓ భూమి కేసులో తమ నాయకుడు కొక్కిరాల ప్రేంసాగర్‌రావుపై కొందరు బురదజల్లే ప్రయత్నం చేస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దీనికి తమ నాయకుడికి, పార్టీకి ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కమతం సతీశ్, నూనె మల్లయ్య, బొద్దున రామ్మూర్తి, భరత్‌రెడ్డి, రాయమల్లు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న కొక్కిరాల సురేఖ

సంక్షిప్త వార్తలు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

భీమారం: మండలంలోని కాజిపల్లి, భీమా రం గ్రామాలకు చెందిన ఇద్దరికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.5వేల చెక్కులను సోమవారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్, కాజిపల్లి సర్పంచ్ తిరుపతి లబ్ధిదారులకు అందజేశారు.

ఆర్థిక సాయం

జన్నారం: సైనాసిస్ నరాల వ్యాధితో బాధపడుతున్న గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి సభ్యుడు గజ్జెళ్ల చిరంజీవి వైద్య ఖర్చుల కోసం సంక్షేమ సమితి రాంపూర్ ఆధ్వర్యంలో సోమవారం రూ.22,200 ఆర్థిక సాయం అందజేశారు.

ఉచిత వైద్య శిబిరానికి గ్రామస్తులు

చెన్నూర్‌రూరల్: బాల్క ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిమ ఆసుపత్రి సహకారంతో మండలంలోని ఆస్నాద గ్రామం నుంచి కరీంనగర్‌లోని ప్రతిమ ఆసుపత్రికి వెళ్లే ఉచిత బస్సును సోమవారం ఉప సర్పంచ్ నస్కూరి శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించారు.

ప్రభుత్వ విప్‌ను కలిసిన రవీందర్

మందమర్రిరూరల్: మందమర్రి బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడినిగా నూతనంగా ఎన్నికైన రవీందర్ సోమవారం ప్రభుత్వవిప్ బాల్క సుమన్ కలిసి పుష్పగుచ్ఛం అందించి ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

గాంధారి మైసమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ

చెన్నూర్: మందమర్రి మండలంలోని గాంధారి ఖిలా మైసమ్మ ఆలయంలో వచ్చే నెల 3, 4, 5 తేదీల్లో జరిగే మైసమ్మ జాతరను విజయవంతం చేయాలని కోరుతూ స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో సీఐ ప్రవీణ్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ కరుణసాగర్ రావుతో కలిసి ఆదివాసీ నాయకపోడ్ సేవా సంఘం నాయకులు సోమవారం పోస్టర్ ఆవిష్కరించారు.

ఘనంగా మాజీ మంత్రి వర్ధంతి

జన్నారం: మాజీ జౌళిశాఖ మంత్రి స్వాతంత్ర్య సమరయోధుడు కేవీ కేశవులు వర్ధంతిని మండల కేంద్రంలో సోమవారం బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

లేబర్ కార్డు తీసుకోవాలి

లక్సెట్టిపేట: భవన నిర్మాణ కార్మికులు లేబర్‌కార్డు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ కాంతయ్య అన్నారు. స్థానిక సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో కార్మికుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు.

పంచాయతీ భవనానికి భూమి దానం

కోటపల్లి: మండలంలోని వెలమపల్లి పంచాయతీ భవన నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ వాలశ్రీనివాసరావు తండ్రి వాలా మోహన్‌రావు జ్ఞాపకార్థం రెండు గుంటల భూమిని దానం చేసినట్లు వైస్ ఎంపీపీ వాలశ్రీనివాసరావు తెలిపారు.

మరమ్మతు చేశారు..!



సాక్షి స్పందన

మంచిర్యాలక్రైం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మెయిన్ గేట్ ప్రహరీ వద్ద పైపులైన్ లీకేజీ అయింది. 20రోజుల క్రితం తవ్వి, పూడ్చకుండా వదిలేయడంతో 'తవ్వారు.. వదిలేశారు' అనే శీర్షికన 'సాక్షి' సోమవారం కథనం ప్రచురించగా అధికారులు స్పందించారు. మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ నీటిని సరఫరా చేసే సిబ్బందితో మాట్లాడి మరమ్మతులు చేయించారు. దీంతో సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి'కి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డేశారు.. సైడ్‌బర్మ్ మరిచారు..!

అటెన్షన్ ప్లీజ్..



భీమారం: మండలకేంద్రం నుంచి కొత్తపల్లి వరకు నిర్మించిన బీటీ రోడ్డుకు ఇరువైపులా సైడ్‌బర్మ్ వేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకిరువైపులా సైడ్‌బర్మ్ వేసి ప్రమాదాలు అరికట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

సంబంధిత అధికారి : రాజమౌళి, సబ్‌డివిజన్ ఏఈ, చెన్నూర్ ఫోన్ నంబర్ : 99890 05588

కుష్ఠు నిర్మూలనపై అవగాహన

చెన్నూర్‌రూరల్/దండేపల్లి/కాసిపేట: జాతీయ కుష్ఠు నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చెన్నూర్, దండేపల్లి, కాసిపేట మండలకేంద్రాల్లో కుష్ఠు వ్యాధిపై వైద్యులు అవగాహన కల్పించారు. గ్రామస్తులతో కుష్ఠు వ్యాధి నిర్మూలనపై వైద్యులు ప్రతిజ్ఞ చేయించారు. వ్యాధి లక్షణాలను వివరిస్తూ, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమాల్లో దండేపల్లిలో డీపీఎంవో మొగిలి, చెన్నూర్‌లో డీపీఎంవో రాఘువయ్య, సర్పంచులు, కార్యదర్శులు, వార్డు సభ్యులు, ఆశకార్యకర్తలు, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



దండేపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది, ఆశకార్యకర్తలు

'కంటి వెలుగు' పరిశీలన

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డులో నిర్వహిస్తున్న కంటి వెలుగు కేంద్రాన్ని కలెక్టర్ భారతీ హోళ్లికేరి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కంటి అద్దాలు పంపిణీ చేయాలని సూచించారు. లబ్ధిదారులకు అన్ని విధాల సౌకర్యాలు కల్పించాలన్నారు. ఇప్పటివరకు ఎంతమందికి కంటి అద్దాలు పంపిణీ చేశారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, సిబ్బంది గఫూర్, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

దుగ్నెపల్లిలో 'కంటివెలుగు' ప్రారంభం

చెన్నూర్‌రూరల్: మండలంలోని దుగ్నెపల్లిలో కంటివెలుగు శిబిరాన్ని జెడ్పీటీసీ మోతె తిరుపతి, ఎంపీపీ మంత్రి బాపు ప్రారంభించారు.